క్లుప్తంగా

25న అద్దె గదులకు వేలం

ఇచ్చోడ: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అద్దె గదులకు ఈనెల 25న వేలం వేయనున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. ఈనెల 22న నిర్వహించిన వేలంలో అద్దె గదులకు టెండర్లు వేయక పోవడంతో తిరిగి ఈనెల 25 వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అద్దె గదులను ఎస్టీలు, స్థానికులకు మాత్రమే వేలంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు.

నేడు వారసంత వేలం

నేరడిగొండ: నేరడిగొండ వారసంత వేలం పాటను సోమవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పంచాయతీకి ఎలాంటి బకాయి లేని వారు రూ.10వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలోని ప్రతీ శుక్రవారం జరిగే వారసంతకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ అన్నారు. ఉదయం 10 గంటలకు వేలంలో పాల్గొనే వారు రూ. 10వేలు చెల్లించాలని పేర్కొన్నారు.

బేల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 27న ప్రతీ బుధవారం నిర్వహించే వారసంతతో పాటు దినసంతకు వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50 వేలు, దినసంత వేలంలో పాల్గొనే వారు రూ.25 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

ప్రతిభా పురస్కారం అందుకున్న సాయి



పురస్కారం అందుకుంటున్న సాయిచరణ్

గుడిహత్నూర్: మండలంలోని తోషం గ్రామానికి చెందిన మెంగని సాయిచరణ్ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నాడు. ఆదివారం జిల్లా కేంద్రంలో జెడ్పీ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, సినివారం, ఆదిలాబాద్ కళా విహారం సంయుక్తంగా నిర్వహించిన కళా పురస్కారాల్లో సాయిచరణ్ ప్రతిభా పురస్కారం అందజేశారు. సాయిచరణ్ డైరెక్టర్‌గా, నటుడిగా పలు షార్ట్ మూవీస్, టెలీ ఫిల్మ్‌లు, వీడియో పాటల్లో నటించి జిల్లాకు వన్నె తేవడంతో ఈ పురస్కారం అందినట్లు తెలిపారు. త్వరలో తాను నటిస్తున్న సినిమా సైతం ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు.

ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడిగా నాగారెడ్డి



నియామక పత్రం అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

తాంసి: తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ తాంసి, భీంపూర్ మండలాల అధ్యక్షుడిగా సామ నాగారెడ్డిని ఆదివారం ఎన్నుకున్నారు. తాంసి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా భగువాండ్లు, ప్రధాన కార్యదర్శిగా నరేందర్ రెడ్డి, కోశాధికారిగా రమేశ్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు ఆశన్న, రమేశ్, గణేశ్, బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు తరలిన మాల జంగం కులస్తులు


ఆదిలాబాద్‌టౌన్: శివ మహేశ్వర మాల జంగం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను ఆదివారం సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాజరి వినోద్, దేవల్ల శంకరయ్యతో పాటు 16 మంది సభ్యులు ప్రత్యేక వాహనంలో వేములవాడకు తరలివెళ్లారు. అక్కడ ఆధార్ కార్డుతో క్యూలో నిల్చుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు గాజరి సంతోష్, దేవళ్ల రాజమల్లు, మాదం మల్లయ్య, దేవళ్ల మల్లికార్జున్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న పలువురి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గనగర్ కాలనీ శివారు ప్రాంతంలో పేకాడుతున్న పలువురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఏడుగురు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేయడం జరిగిందన్నారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 3,500 నగదు, ఏడు సెల్ ఫోన్‌లు, ఏడు ద్విచక్ర వాహనాలు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

వృథాగా 'భగీరథ'

నార్నూర్: గిరిజన గ్రామాల్లో తాగునీరు లేక గిరిజనులు అల్లాడుతున్నారు. బిందె పట్టుకొని నీళ్ల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి. నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ భగీరథ ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.





'మోడల్'.. అస్తవ్యస్తం

బేల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రూ.5.40 లక్షల వ్యయంతో చేపడుతున్న మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో క్యూరింగ్ లేకపోగా.. పునాది, పిల్లర్ల వరకు పనులు చేపట్టారు. 20 రోజుల నుంచి పనులు ముందుకు సాగడం లేదు.



తల్లిదండ్రుల నిరీక్షణ

నేరడిగొండ: తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చదివించాలని ఆశ్రమ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. గేటులోనికి రానివ్వకపోవడంతో గేటు బయటనే నిరీక్షించాల్సి వచ్చింది.

నిరుపయోగంగా రైతువేదికలు

- విడుదల కాని నిర్వహణ బిల్లులు
- పట్టించుకోని అధికారులు

రైతువేదికల వివరాలు..

మొత్తం మండలాలు	21
క్లస్టర్లు	101
రైతు వేదికలు	101
జిల్లాలో రైతులు	1లక్ష 48వేలు
సాగు భూమి	5.75 లక్షల ఎకరాలు



బుగ్గారం గ్రామంలో గల రైతు వేదిక

నేరడిగొండ: రైతులకు ఆధునాతన వ్యవసాయ పద్ధతులు వివరించడం, వారంతా ఒకచోట సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గత ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయలు వెచ్చించి రైతువేదికలు నిర్మించారు. ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఎంచుకొని వీటిని ఏర్పాటు చేశారు. నిర్వహణ బాధ్యతను వ్యవసాయ విస్తరణ అధికారులకు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఖర్చులకు రూ.9 వేలను కేటాయించింది. ఈ మొత్తాన్ని తాగునీరు, విద్యుత్ బిల్లు, స్వీపర్, స్టేషనరీ ఇతర ఖర్చులకు ఉపయోగించాలి. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిర్వహణ ఖర్చులకు నిధులు నాలుగేళ్లుగా విడుదల కావడం లేదు.

వసతుల కల్పన అంతంతే..

రైతువేదికలు చాలా చోట్ల గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ప్రహరీ, భద్రతా సిబ్బంది లేక రైతువేదికల్లో సామగ్రిని ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం వంటివి జరిగాయి. చాలా రైతు వేదికల చుట్టూ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. నీటి వసతి లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఎరువులు, విత్తనాల పంపిణీ రైతువేదికల్లో చేపట్టాలని నిర్ణయించినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. ఇటీవల మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు, రాష్ట్ర, జిల్లా అధికారుల సలహాలు, సూచనలు చేయడానికి ఎల్ఈడీ టీవీ, కంప్యూటర్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ప్రతీ మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అధికారుల సమన్వయ లోపంతో ఈ కార్యక్రమాలకు రైతులు పెద్దగా రావడం లేదు. కొన్నిచోట్ల ఏఈవోలే తమ సొంత డబ్బులతో రైతువేదికల నిర్వహణ కోసం సిబ్బందిని నియమించుకుంటున్నారు. రైతు వేదికలకు నిర్వహణ ఖర్చులు విడుదల చేసి వాటిని వినియోగంలోకి తెచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న యూత్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదం తెలపడం పట్ల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు అరికిల్ల పరమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకుల కోసం నిరుద్యోగులు వారి కాళ్ల మీద వారు నిలబడాలన్న ఉద్దేశ్యంతో రాజీవ్ యువ వికాసం ద్వారా రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, అశోక్, మారుతి, నిసార్, భీమన్న, భాగ్యలక్ష్మి, రాజేశ ఉమేశ్, అర్షద్, కలీం, మహేందర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

సిరికొండ: ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన ప్రతీ పేదవాడికి ఇల్లు అందజేస్తామని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన రిమ్మ గ్రామంలో 153 మందికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పనులకు భూమిపూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేద ప్రజల కోసం కృషి చేస్తుందన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెందుర్ అనిల్ కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో ఎస్సై ముజాహిద్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలో పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ పీడీఎస్ బియ్యం సేకరించి మహారాష్ట్రకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తుండగా ఆదివారం రాత్రి పట్టుకోవడం జరిగిందని ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఎస్‌కే జాహిర్ పీడీఎస్ బియ్యం విక్రయించేందుకు మహారాష్ట్రకు 2.40 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఆటో వెంట పడి రాంపూర్ సమీపంలోని జాతీయ రహదారి 44పై పట్టుకోవడం జరిగిందన్నారు. పట్టుబడిన బియ్యాన్ని, ఆటోను స్వాధీనం చేసుకోని బియ్యం యాజమాని సలీంపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు మంగళ్‌సింగ్, ముక్కె వికాస్‌లు ఉన్నారు. జ

తాంసిలో..

తాంసి: తాంసి మండల కేంద్రం సమీపంలో ఆటోలో తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తాంసి ఎస్సై రాధిక తెలిపారు. ఆదివారం వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో బియ్యాన్ని తరలిస్తున్న మైనర్ బాలుడిని పట్టుకున్నారు. ఆటోలో ఉన్న మూడు క్వింటాళ్ల బియ్యంతో పాటు ఆటోను, బాలుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దర్బార్ విజయవంతం చేయండి

ఉట్నూర్‌రూరల్: కోయ పున్నం గోండ్వాన రాయి దర్బార్‌ను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. అందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. గోండ్వాన సమాజం తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. రాజ్‌గోండ్ సేవా సమితి భవనానికి కోటి రూపాయలు మంజూరు చేసిన ఎమ్మెల్యేను సన్మానించారు. రాజ్‌గోండ్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, గేడం నిరంజన్, ఆత్రం ప్రకాశ్, బాలాజీ, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా బాజీరావు బాబా సప్తాహం

బేల: మండలంలోని దోప్టాల గ్రామంలో వారం రోజులుగా కొనసాగిన ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలను ఆదివారం స్థానికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో పల్లకి, చిన్నారులను దేవతల రూపంలో అలకరించి శోభాయాత్ర చేపట్టారు. పల్లకిలకు ఇంటింటా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. చివరగా కాల దహీ హండీ చేపట్టి, అన్నదానం నిర్వహించారు.

గోశాలకు పశువులు తరలింపు

ఆదిలాబాద్‌టౌన్: పశువులను అక్రమంగా తరలించేందుకు పశువుల పాకలో బంధించిన ఏడు పశువులను గోశాలకు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి కాలనీకి చెందిన షేక్ గౌస్ మహారాష్ట్రలో జరిగిన అంగడిలో రెండు దూడలు, ఏడు ఆవులను కొనుగోలు చేసి ఆదిలాబాద్ పట్టణానికి తీసుకొచ్చాడు. వాటిని తిర్పెల్లి సమీపంలోని విమల్ గ్యాస్ గోడౌన్ వెనుక గల వాజ్జీకర్ ప్రదీప్‌కు చెందిన ఎడ్ల కొట్టంలో ఉంచి వాటిని అమ్మేందుకు ప్రయత్నించాడు. వాటిని స్వాధీనం చేసుకుని గుడిహత్నూర్‌లోని గోశాలకు తరలించినట్లుగా వెల్లడించారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

- నివాళులర్పించిన నాయకులు

కైలాస్‌నగర్: భగత్‌సింగ్ స్ఫూర్తితో కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్ అన్నారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సుందరయ్య భవనం నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు డప్పుచప్పుళ్ల ర్యాలీ నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోరుకున్న భగత్‌సింగ్ ఆశయాలు ఇప్పటికీ నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కిరణ్, ఆర్.మంజుల, మెరుగు జనార్ధన్, సునీత, పోచన్న, లంక జమున పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో...

స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతిని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకుని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్, పవన్, సాయికుమార్, సచిన్, ప్రవీణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. భారత దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన వారి వీరత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో కొడప సురేశ్, శ్రీకాంత్, ప్రసాద్, సాయికుమార్, ఉదయ్, కిరణ్, తరుణ్ పాల్గొన్నారు.

- సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలోనూ భగత్‌సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్ ఎదుట ఫ్యాక్టరీ పునః ప్రారంభం కోసం చేపట్టిన దీక్ష శిబిరంలో అఖిలపక్షరైతు సంఘం నాయకులు, సాధన కమిటీ సభ్యులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సింగారం రమేశ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ముందడుగు వేయాలి

కైలాస్‌నగర్: మహిళలు వృత్తినైపుణ్య ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ రవి కిరణ్ యాదవ్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీ, బ్యూటీషన్ కోర్సుల్లో మూడు నెలల పాటు అందించిన ఉచిత శిక్షణ ముగిసింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలు, యువతులకు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ.. తమ కుటుంబాలకు అండగా నిలువాలన్నారు. వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా ఆయా రంగాల్లో రాణించవచ్చన్నారు. రిటైర్డు అధ్యాపకులు సల్ల విజయబాబు, మహేందర్, శ్రీనివాస్, శ్రావణి, ఓరుగంటి వీణ, హరిందర్, ప్రవళిక, పూజిత, మీనా పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని తేజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఆది వారం రూ.20లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నియోజకవర్గానికి రూ.13 కోట్ల నిధులు తెచ్చామని, ప్రతీ గూడెంలో రోడ్లు వేసే బా ధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోతా రెడ్డి, పాల శంకర్, మొగులన్, వి లాస్, అశోక్, స్వామి, సతీష్, కృష్ణ, నిషంత్, గంగాధర్, పృథ్వీరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలో ఆదివారం ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.25 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులకు బీజేపీ మండల అధికార ప్రతినిధి మెంచు నరేందర్ భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్, ఉత్తమ్, రవీందర్, గంగారెడ్డి, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

చీరలతో చేపల వేట



భానుడి ప్రతాపంతో ఇప్పటికే వాగులు, చెరువుల్లో నీరులేక అడుగంటి పోతున్నాయి. మండలంలోని వడ్డాడి శివారులో మత్తడివాగు ప్రాజెక్టులో నీరు తగ్గుముఖం పట్టగా, ఎగువభాగంలో పలుచోట్ల నీటిమడుగులు ఏర్పడ్డాయి. దీంతో చేపలు పట్టేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. వామన్‌నగర్ గ్రామస్తులు పలువురు చీరల సాయంతో చేపలు పడుతూ కనిపించారు.

- తాంసి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి సమీపంలో ఎడ్ల బండికి బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై అప్పారావ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి మహారాష్ట్ర కిన్వట్‌కు చెందిన వృద్ధుడు ఆత్మరాం, యువకుడు స్వామీ ఎంహెచ్ 26 సీజీ 1220 నంబర్ గల బైక్‌పై ఇచ్చోడ నుంచి కిన్వట్‌కు వెళ్తున్న క్రమంలో బజార్‌హత్నూర్ గ్రామ సమీపంలో ఇచ్చోడ సొనాల ఆర్అండ్‌బీ రహదారిపై ఎడ్ల బండిని గమనించక ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆత్మరాం, స్వామి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

జిల్లా కేంద్రంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: రెండు బైక్‌లు ఢీకొని ఒకరు గాయపడిన ఘటన శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఖిల్లా స్కూల్ ప్రాంతంలో చోటు చేసుకుంది. సాత్నాల మండలంలోని జామ్ని గ్రామానికి చెందిన కనక దత్తాత్రి బైక్‌పై జీఎస్ కాలనీ వైపు నుంచి ఆదిలాబాద్ పట్టణం వైపు వస్తున్నాడు. అదే సమయంలో పట్టణానికి చెందిన సయ్యద్ పర్వేజ్ వేగంగా బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో దత్తాత్రి గాయపడ్డారు. దీంతో స్థానికులు ఆయనను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి రాంచందర్ టూటౌన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసుల నమోదు చేసినట్లు ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపాడు.

కైలాస్ నాయక్ మృతి తీరని లోటు



పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీ నగేశ్

నార్నూర్: మండలంలోని భీంపూర్ గ్రామానికి చెందిన గ్రామపెద్ద నాయక్ రాథోడ్ కైలాస్ నాయక్ మృతి తీరని లోటని ఆదిలాబాద్ ఎంపీ గేడం నగేశ్ అన్నారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గతంలో కైలాస్ నాయక్‌తో ఉన్న సంబంధాల్ని గుర్తు చేసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి కైలాష్ నాయక్ ఎంతో కృషి చేశారని, ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. గ్రామాన్ని ఏకతాటిపై నడిపించారని గుర్తు చేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు భిక్షపతి రాథోడ్, తదితరులు ఉన్నారు.